# పుస్తక పరిచయం




Writer
Dr.Veluvolu Nagarajya Lakshmi
301, Ramanna Pet
1st Lane, Ramanna Pet
Guntur – 522 007
Phone: 9394113848

**తెలుగు** , సంస్కృతభాషల్లో ప్రావీణ్యులు, ఉన్నత పట్టాలు పొందినవారు సారస్వత కళానిధి డాక్టర్ వెలువోలు నాగరాజలక్ష్మిగారు. ప్రకాశం, గుంటూరు జిల్లాలలోని ప్రభుత్వ డిగ్రీకళాశాలల్లో పనిచేసిన విశ్రాంతప్రాచార్యులు. వివిధసాహితీ సంస్థల కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనడమే కాక కొన్ని సంస్థల కార్యనిర్వహణ సంఘసభ్యులుగా కూడా పనిచేస్తున్నారు. తమ సాహితీసేవకు గాను వివిధ సంస్థల నుంచి పురస్కారాలను, విశిష్టమైన గుర్తింపునీ అందుకున్నారు. వారు వ్రాసిన వచన కవితాసంపుటి ఈ 'ఎక్కడికీ పయనం'. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సృజనాత్మకత మరియు సాంస్కృతిక సమితి సహకారంతో ఈ పుస్తకాన్ని మనముందుకు తీసుకొచ్చారు. ఈ సంపుటిలో 50 పైగా కవితలున్నాయి. కవితావస్తువు రీత్యా ఎంతో వైవిధ్యం ఉన్న కవితలివన్నీ. రచయిత్రి తన ముందుమాటలో చెప్పినట్లు "కవిత్వానికి కావలసింది ఆవేశం, కవిత్వం కలిగించవలసింది చైతన్యం. నా గుండెలోతుల్లో గూడుకట్టుకున్న భావరేఖలతో సమాజంలో చైతన్యపు చిరుదివ్వెలు వెలిగించనన్న ఆత్మవిశ్వాసంతో అంతరంగ ఆవిష్కరణ చేయసంకల్పించాను" - ఆ ఆశయానికి అనుగుణం గానే ఈ పుస్తకంలోన్ని కవితలన్నీ కొనసాగాయి. పుస్తకం, భాష, మనసు, పల్లె, చెట్టు, ..ఇంకా సమకాలీన సమాజంలోని సంఘటనలూ అన్నీ ఇందులో కవితారూపంలో మనకు సాక్షాత్కరిస్తాయి. జీవితదర్శనం పేరుతో ఈ పుస్తకానికి ప్రస్తావన వ్రాసిన డా.కంపెల్ల రవిచంద్రన్‌గారు " శ్రీమతి నాగరాజలక్ష్మి కవితల్లోని పదవర్తన శివతాండవసమయంలోని పదనర్తనలా సమ్మోహింపచేస్తుంది. జగన్మాత సుమ సమచరణ అరుణస్పర్శలా ఈమె కవితాసృష్టి ఒక్కోచోట ప్రేమవర్షం ఔతుంది"అన్నారు. ఈ సంపుటిలోని ప్రతికవితా ఇందుకు ఉదాహరణలే. 'నాన్న' గురించి చాలామంది వ్రాశారు కానీ 'నాన్న పై కండువా' గురించి రచయిత్రి వ్రాసిన వాక్యాలు మనసును తడిచేస్తాయి. "వాన కురిసిన నాటి సాయంకాలం / బడినుండి వడివడిగా / పుస్తకాల సంచితో నేను పరుగెత్తుకుని వస్తుంటే / తాను వానలో తడుస్తూ / ప్రేమతో నాకోసం ఎదురువచ్చిన నాన్న / పై కండువా, తడిసిన గువ్వను / తనలో దాచుకున్న చెట్టు రెమ్మలా నన్ను తనలో దాచుకుంది" అని పాఠకుల జ్ఞాపకాల తేనెతుట్టెను కదుపుతారు. "కలలరెక్కలపై తేలిపోతూ ఆకాశమంత ఎత్తుకు ఎదిగిన / అధికారిని వేడుకున్న ఆశాజీవిని / వాస్తవం అనే నగ్నసత్యాన్ని తెలిపి / తిరిగి నేల మీదకు నిర్లిప్తంగా తెచ్చి నిలిపే సుప్తశిల" అంటారు బహుళ అంతస్తుల భవనాల్లోని 'లిఫ్ట్' గురించి. ఈ సంపుటిలోని ప్రతికవితా గాఢమైన ఆలోచనలోంచి పుట్టినదే, పాఠకులలో ఆలోచనలు రేకెత్తించేదే.!

★★★




*Writer*
**Dr. Bheempalli Srikanth**
**8-5-38 Teachers Colony**
**Mahaboob Nagar – 509 001**
**Phone: 9032844017**

**తెలుగు వచనకవితా ప్రపంచంలో** అనేక ప్రయోగాలు వచ్చాయి, వస్తున్నాయి. మినీ కవితలు, మైక్రో కవితలు, నానీలు, నానోలు, రెక్కలు, మెరుపులు .. ఇలా! అదే కోవలో డా.భీంపల్లి శ్రీకాంత్‌గారి కలంనుంచి వెలువడిన మరొక సరికొత్త కవితా ప్రక్రియ ‘మొగ్గలు‘. దీన్ని పరిచయం చేస్తూ ముందుమాటలో డా.మనస చెన్నప్పగారు ఇలా వ్రాశారు "డా. భీంపల్లి శ్రీకాంత్ ఆధునిక కవితా రూపాలకు తానొక స్వీయకవితా రూపాన్ని అందించి, దానికో పేరు పెట్టడం అతని నూతన కవితాతృష్ణను తెలియజేస్తుంది". చెన్నప్పగారు అన్నట్లుగానే ఈ సంపుటిలో ప్రతిమొగ్గా కవి కవితాతృష్ణకు ప్రతిరూపాలు. ఈ సరికొత్త కవితాప్రక్రియలో మూడే పంక్తులు ఉంటాయి. మొదటి రెండు పంక్తులూ ఒక అంశాన్ని భావయుక్తంగా, అర్థవంతంగా చెబితే మూడవ పంక్తి దానికి సమర్థింపువాక్యంగా ఉంటుంది. అయితే మొదటి పంక్తికి రెండవపంక్తి కొనసాగింపుగా ఉంటుంది. ఈ భావాన్ని సమర్థిస్తూ, అన్వయిస్తూ, బలపరుస్తూ వచ్చే చివరిపంక్తి ముక్తాయింపుగా ఉంటుంది. ఈ మూడవపాదాన్ని చెప్పడం వల్ల కవి ఒక కొత్త నినాదాన్ని సూక్తిని చెప్పినట్లు అవుతుంది. ఈ పుస్తకంలోని మొగ్గలు లోని కొన్ని చివరిపాదాలు ‘ అక్షరం రసాత్మక కావ్యం‘, ‘ కిరణం లోకానికి వెలుగు‘, ‘ బంధం అనురాగ సుగంధం‘,‘ మానవత్వం మనిషికి ఆభరణం‘ లాంటి సూక్తులు/ నినాదాలు కొత్తవి కాకపోయినా వాటిని ‘మొగ్గలు‘ వికసించడానికి వాడుకున్న విధానం బావుంది. "కొన్ని అక్షరాలు చాలు / కవిత్వాన్ని ఆవిష్కరించడానికి/ అక్షరం రసాత్మక కావ్యం" , " కొన్ని విలువలు చాలు / మానవతా దీపాన్ని వెలిగించడానికి / మానవత్వం మనిషికి ఆభరణం" ఇవీ కొన్ని మొగ్గలు. ఒక విధంగా చూస్తే ఈ మొగ్గలను చివరి నుంచి చదవడం ప్రారంభిస్తే చివరి పంక్తిలోని సూక్తికి వివరణలా సాగుతాయి మొదటి రెండు పంక్తులూ. " బాధ్యతలు సంపూర్ణంగా నిర్వర్తించనిదే / ఏ మనిషీ జీవితంలో ఎదగలేడు / బాధ్యత మనిషికి అనివార్యం" ఈ మొగ్గనే " బాధ్యత మనిషికి అనివార్యం అంటే ఏమిటంటే బాధ్యతలు సంపూర్ణంగా నిర్వర్తించనిదే ఏ మనిషీ జీవితంలో ఎదగలేడు !" అని వివరణగా చెప్పుకోవచ్చు. "గాయం గేయమై ప్రవహిస్తేనే కానీ / వేదన అనంతశోకమై నిలువెల్లా పారాడదు / గేయం గాయపడిన అక్షరం", "వానజల్లు కురిస్తేనే కానీ / పంట శిరసెత్తి జెండాల రెపరెపలాడదు/ చినుకు పంటకు ప్రాణవాయువు".. ఇలా సాగుతాయి ఈ మొగ్గలు. ఎక్కువ శాతం ఈ మొగ్గలు సూక్తుల వివరణలా అనిపించినా అక్కడక్కడా ఎదురయ్యే పదచిత్రాలు ఆకర్షణీయంగా ఉన్నాయి " చినుకు స్నానమాడితేనే కానీ / ఆకు ముత్యాన్ని కిరీటంలా ధరించదు / వాన చినుకు మెరిసే ముత్యం" ఇలాంటివి చక్కటి పదచిత్రాలకు ఉదాహరణలు. డా. శ్రీకాంత్‌గారి సరికొత్త ప్రయత్నం అభినందనీయం.

***

ఈ శీర్షికలో తమ పుస్తక పరిచయాలు ప్రచురింపబడాలనుకునే వారు, తమ పుస్తకాలు ఒక్కొక్క కాపీని క్రింది ఎడ్రసుకి మెయిల్ చెయ్యవలసిందిగా ‘కౌముది‘ విజ్ఞప్తి చేస్తోంది.

**Editor,**
**KOUMUDI (Web Monthly)**
**4251 - Escudo Ct**
**Dublin - CA 94568, USA**